రైతుకు వెంటనే టోకెన్లు అందజేయాలి

కలెక్టర్ వల్లూరి క్రాంతి

పుల్కల్ సీఈవో నాగయ్యతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

పుల్కల్,మే 24 : రైతుల నుంచి ధాన్యం సేకరించిన వెంటనే వారికి టోకెన్లు అందజేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, పీఏసీఎస్ గోదాములను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. మండలం లోని కోడూరు,ఇసోజిపేట రైస్ మిల్లులను, రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. అనంతరం అక్కడున్న రైతులతో కాసేపు మాట్లాడి తూకంలో ఏమైనా అవకతవకలు ఉన్నాయా అని వారితో మాట్లాడి తెలుసుకున్నారు. రైతులు కేంద్రాల వద్దకు ధాన్యాన్ని తీసుకు వచ్చిన వెంటే తూకం జరిపించాలని అధికారులకు సూచించారు. అధికారులు ప్రతి రోజు ట్రాక్ షీట్ పరిశీలించాలన్నారు. సేకరించిన ధాన్యాన్ని వెంటనే లారీల్లో లోడ్ చేయించాలన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున రైతులు ఎలాంటి ఆందోళనలకు గురి కాకుండా కొనుగోలు కేంద్రాలకే ధాన్యాన్ని తరలించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్ లో 211 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ వెంట ఆర్‌డీవో బాల్‌రాజ్, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో ఆనంద్ మేరి ఉన్నారు.

కుట్టు కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

సంగారెడ్డి కలెక్టరేట్, మే 24: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లల కోసం యూనిఫామ్ తయారు చేసే కుట్టు కేంద్రాన్ని శుక్రవారం స్థానిక బైపాస్‌రోడ్డులోని డీఆర్డీఏ కేంద్రంలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రారంభించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా యూనిఫామ్ కుట్టేందుకు అవకాశం కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎవరి గ్రామం పిల్లలకు వారే యూనిఫామ్ కుట్టే విధంగా బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. డీఆర్డీవో జ్యోతి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ వెంకటేశ్వర్లు, మెప్మా పీడీ గీత, అదనపు డీఆర్డీవో జంగారెడ్డి, ఏపీఎంలు, సమాఖ్య సభ్యులు ఉన్నారు.

సైన్స్ మ్యూజియం సందర్శన

జిల్లా కేంద్రంలోని సైన్స్ మ్యూజియాన్ని శుక్రవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి సందర్శించారు. సర్ సీవీ రామన్ సైన్స్ మ్యూజియం ఆవరణలో సైన్స్ ప్రాజెక్టులు, బొటానికల్ గార్డెన్‌లోని మొక్కలను పరిశీలించారు. మ్యూజియంలో కలియతిరుగుతూ అక్కడ ఏర్పాటు చేసిన సైన్స్ పరికరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. మ్యూజియం అభివృద్ధి కోసం పలు సూచనలు, సలహాలు చేశారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, సీఎం వో వెంకటేశం, అధికారి సిద్ధారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు అవగాహన కలిగించాలి

రాయికోడ్, మే 24 : గ్రామస్థాయిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు, వసతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకునే విధంగా గ్రామ స్థాయి, మండల స్థాయి అధికారులు అవగాహన కలిగించాలని జిల్లా పంచాయతీ శాఖ అధికారి సాయిబాబా అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సంగాపూర్, సింగితం గ్రామాల్లో నిర్మాణం చేపట్టిన వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డులు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, వన నర్సరీలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 647 గ్రామ పంచాయతీలలో మౌలిక సదుపాయలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. వీటిని ప్రతి గ్రామంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రతి గ్రామంలో 600 కిలోలకు తగ కుండా వర్మీ కంపోస్ట్ ఎరువులను తయారు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎంఎం షరీఫ్, ఎంపీవో అంజలిదేవి, పంచాయతీ కార్యదర్శులు అని త, రాములమ్మ ఉన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలి

న్యాల్‌కల్, మే 24 : వానకాలం సీజన్‌లో రైతులకు సాగు చేసేందుకు నాణ్యమైన విత్తనాల అందించాలని, వాటిని అధిక ధరలకు అమ్మితే కఠినే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి లావణ్య హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని రైతు వేదికలో మండలంలోని విత్తన, ఎరువులు, క్రిమి సంహారక దుకాణాదారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఏఈ వో సాయిలు, షరీఫ్, హీనా, నిఖిత, అర్చన తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

ఐఏఎస్ అధికారి భారతిహోళికేరి

గుమ్మడిదల, మే 24 : రైతులు పండించిన ధాన్యం కొనుగోలును త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఐఏఎస్ అధికారి ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రమైన గుమ్మడిదలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ భారతిహోళికేరి, జిల్లా అదనపు కలెక్టర్ మాధురి తనిఖీ చేశారు. ఈసందర్భంగా కొనుగోలు కేంద్రం వద్ద జరుగుతున్న కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించాలని సూచించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు. ధాన్యాన్ని లారీల ద్వారా తరలించడానికి ఇబ్బందులు అవుతున్నాయని రైతులు తెలిపారు. వచ్చే నెల 15వ తేదీ వరకు కొనుగోలు జరగాలని కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఇప్పటి వరకు 6వేల క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు వారికి తెలిపారు. వీరితో పాటు గిర్ధావరి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న భారతిహోళికేరి

భూపంపిణీ చేయాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

కోహీర్, మే 24 : భూమి లేని నిరుపేదలకు భూపంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ కోరారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నాగిరెడ్డిపల్లి గ్రామ నిరుపేదలతో కలిసి కోహీర్‌లోని తహసీల్దార్ బాల శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగిరెడ్డిపల్లిలో ఎంతోమంది భూమి లేని నిరుపేదలు ఉన్నారని వివరించారు. సర్వే నంబర్ 102, 103లో 71ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. 2017 నుంచి పోరాటం చేస్తున్నా రెవెన్యూ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కోర్టు ఆదేశాల మేరకు భూమి లేని నిరుపేదలకు వెంటనే భూపంపిణీ చేయాలన్నారు. సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కనకయ్య, ప్రభాకర్, సబితా, సుజాత పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జోగిపేటలో మాట్లాడుతున్న జిల్లా శిశు సంక్షేమశాఖ సమన్వయకర్త పల్లవి

అందోల్, మే 24: ప్రతి ఒక్క మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా శిశు సంక్షేమశాఖ సమన్వయకర్త పల్లవి అన్నారు. జోగిపేటలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల చట్టాలు, ఆడపిల్లల చదువు, ప్రాముఖ్యత, బాల్యవివాహాల నిర్మూలన, వారి కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లను వివరించారు. మహిళల హక్కుల పరిరక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు అన్నిరం గాల్లో ముదుండేందుకు ప్రభుత్వాలు సైతం ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. బాలికల కోసం కేంద్ర ప్రభుత్వం బేటి బచావో.. బేటి పడావో లాంటి గొప్ప కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని దీనిపై పూర్తి అవగాహన కలగిఉండి ఆడపిల్లలను బాగా చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, టీఎంసీ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

గోద్రేజ్ ఏరియా మేనేజర్ వేంకటేశ్వర్లు

మనూరు రైతు వేదికలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్లు

మనూరు, మే 24 : రైతులు ఆయిల్‌పామ్ ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చునని గోద్రేజ్ ఏరియా మేనేజర్ వేంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మనూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పలు గ్రామాల రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంట సాగు విషయంలో గ్రామ స్థాయిలో అవగాహన లేక పోవడంతోనే ఆయిల్ పామ్ సాగు చేయలేక పోతున్నారని అన్నారు. దేశ వ్యాప్తంగా ఆయిల్‌పామ్‌కు మంచి డిమాండ్ ఉందన్నారు. ఆయిల్‌పామ్ పండిచే రైతులు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో మొక్కలతో పాటు బిందు సేద్యం సామగ్రి కూడా అందించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల రైతులు మండల వ్యవసాయ అధికారులకు తమ పేర్ల జాబితాను అందజేయాలన్నారు. ఏఈవోలు సంగమేశ్వర్, సాయికిరణ్ రెడ్డి, ప్రవీణ్, మహేశ్, రైతులు గాండ్ల రాజు కుమార్, మారుతి, కుమార్, మొహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

రైతువేదికలో జొన్నల కొనుగోలును పరిశీలిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్ సిబ్బంది

సిర్గాపూర్, మే 24 : జొన్నల కొనుగోలును వేగవంతం చేయాలని నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని కడ్పల్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతు వేదికలో కొనసాగుతున్న జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో అశోక చక్రవర్తి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించారు. జొన్నలు కొనుగోలుపై సంబంధిత సీఈవో శ్రీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 406 మంది రైతుల నుంచి 7894 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేశామని సీఈవో తెలిపారు. 4395 క్వింటాళ్ల జొన్నలు గోదాంకు తరలించామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఉమాశంకర్, గిర్దావర్ మదన్ సిబ్బంది ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

న్యాల్‌కల్, మే 24 : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మహిపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కల్‌బేమల్ గ్రామంలోని పలు వార్డుల్లో పర్యటించారు. రక్షిత మంచినీటి పథకాలు సక్రమంగా పనిచేయక తాగునీటి కోసం తండ్లాడుతున్నారని వాపోయారు. ప్రభుత్వ సకాలంలో పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారని పేర్కొన్నారు. తగు చర్యలు తీసుకొని నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మొక్కలను కాపాడాలి

కోహీర్, మే 24 : హరితహారం నిర్వహణలో భాగంగా నాటిన మొక్కలను వంద శాతం కాపాడాలని మండల పంచాయతీ అధికారి రఘు పంచాయతీ కార్యదర్శిని శుక్రవారం ఆదేశించారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ పల్లెప్రకృతి వనం, నర్సరీ, రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. ఎక్కడా కూడా మొక్కలు ఎండిపోకుండా ముం దస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యదర్శి కృష్ణవేణి ఉన్నారు.

మంజీరాలో మునిగి వ్యక్తి మృతి

పాపన్నపేట, మే 24 : ప్రమాదవశాత్తు నీటమునిగి వ్యక్తి మృతి చెందినట్లు పాపన్నపేట ఎస్సై నరేశ్ శుక్రవారం తెలిపారు. మండలంలోని జయపూరం గ్రామానికి చెందిన బజారు కిష్టయ్య (35) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండురోజుల కింద సమీప బంధువుల పెండ్లి నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి రామతీర్థం గ్రామానికి వచ్చి అక్కడే ఉన్నాడు. శుక్రవారం ఉదయం స్నానం కోసం బంధువులతో కలిసి శివారులోని మంజీర నదికి వెళ్లాడు. అందరూ కలిసి సరదాగా స్నానం చేస్తుండగా కిష్టయ్య ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. ఇది గమనించిన బంధువులు కాపాడేందుకు ప్రయత్నించినా సాధ్యంకాలేదు. దీంతో పాపన్నపేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో గాలించగా, కిష్టయ్య మృతదేహం లభించింది. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్ మృతి

స్తంభంపై బాలరాజు మృతదేహం

మునిపల్లి, మే 24 : విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మెన్ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మల్లికార్జునపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సంగారెడ్డి పట్టాణానికి చెందిన బాలరాజు(22)మునిపల్లి మండలంలోని మల్లికార్జునపల్లిలో జూనియర్ లైన్‌మెన్. మల్లికార్జునపల్లిలోని ఓ రైతు పోలంలో శుక్రవారం విద్యుత్ స్తంభం ఎక్కి విద్యుత్ తీగలు సరి చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్ తగిలి స్తంభంపై అక్కడిక్కడే మృతి చెందాడు. కాగా, మునిపల్లి మండల వాసులు సంబంధిత అధికారి తీరుపై తీవ్రంగా విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారి విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్నందున ఉన్నత శాఖ అధికారులు స్పందించి మునిపల్లి ఏఈపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కమిషనర్ శానిటేషన్ డ్రైవ్

బొల్లారం, మే 24 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో కమిషనర్ మంగతాయారు శుక్రవారం శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య సిబ్బంది చేపడుతున్న పనులను స్వయంగా పర్యవేక్షించారు. పలు వార్డుల్లో వాహనాల్లో చెత్త సేకరణతో పాటు రహదారుల శుభ్రం చేసే ప్రక్రియలను పరిశీలించారు. ఆర్వో శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

తుర్కపల్లిలో కొనుగోలు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీవో అశోక చక్రవర్తి

నారాయణఖేడ్, మే 24: నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆర్డీవో అశోక చక్రవర్తి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రం నిర్వహణ తీరును పరిశీలించారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించాలని, ధాన్యం సేకరణ విషయంలో ఎటువంటి లోటుపాట్లు రాకుడా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఆర్డీవో వెంట డిప్యూటీ తహసీల్దార్ అనుదీప్, సిబ్బంది అనిల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పంచాయతీ అధికారి ఆకస్మిక పర్యటన

ఝరాసంగం, మే 24 : ఝరాసంగం మండల పరిధిలోని కప్పడ్ గ్రామ పంచాయతీలను జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. డంపింగ్ యార్డు, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనం, నర్సరీలు, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కంపోస్ట్ పిట్ నందు వానపాములు బతికి ఉండేలా చూడాలని, కంపోస్ట్ ఎరువు తయారీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగించాలన్నారు. గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్యం పనులు నిర్వహిస్తూ పరిశుభ్రంగా ఉంచాలని కార్యదర్శులకు సూచించారు. ప్లాస్టిక్ చెత్తచెదారం రోడ్డపై లేకుండా చూడాలన్నారు. సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తేవాలన్నారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి లక్ష్మయ్య, కార్యదర్శులు ఉన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

కోహీర్, మే 24 : జహీరాబాద్ పట్టణంలోని సివిల్ కోర్టు ఆవరణలో వచ్చే నెల 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సివిల్ జడ్జి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సూరికృష్ణ కోరారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలో ప్యానెల్ న్యాయవాదులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూరికృష్ణ మాట్లాడుతూ కక్షిదారులకు లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం కలుగుతుందన్నారు. లోక్ అదాలత్ ప్రయోజనాలను కక్షిదారులకు వివరించాలని సూచించారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

బొల్లారం, మే 24: అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు సర్వేనెంబర్ 75లో నిర్మిస్తున్న విల్లాల నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను నిలిపివేసి ప్రధాన ముఖ ద్వారానికి తాళం వేసి చేశారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సత్యనారాయణ, మున్ని నవీన్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దు

నారాయణఖేడ్, మే 24: నకిలీ విత్తనాలు లేదా కాలం చెల్లిన విత్తనాలు విక్రయించిన డీలర్ల లైసెన్స్‌ను రద్దు చేస్తామని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం నారాయణఖేడ్‌లోని ఐకేపీ భవనంలో డివిజన్ పరిధిలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీలకు సంబంధించిన పురుగు మం దులు, ఎరువులను మాత్రమే విక్రయించాలని, ఎమ్మార్పీ ధరలను మించి అధిక ధరలకు విక్రయించరాదని సూ చించారు. వ్యవసాయాధికారు లు శంక ర్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌చారి, శశాంక్, వెంకటేశం పాల్గొన్నారు.

రైతులకు ప్యాకెట్ విత్తనాలే విక్రయించాలి

సంగారెడ్డి, మే 24 : రైతులను మోసం చేసేందుకు విత్తన డీలర్లు పలు రకాలుగా పాల్పడుతారని, నమ్మిన వారిని మోసం చేయొద్దని ప్యాకెట్ విత్తనాలే విక్రయించాలని వ్యవసాయశాఖ డివిజన్ అధికారి మనోహర హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న భూసార పరీక్ష కేంద్రం కార్యాలయంలో డివిజన్ పరిధిలో విత్తనాలు, ఎరువుల డీలర్లు, వ్యవసాయశాఖ క్షేత్రస్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మనోహర మాట్లాడుతూ ఏఈఓలు గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏవోలు అనిత, గణేశ్, ప్రతిభ, ఏఈవోలు శ్రావణ్, శ్రీదేవి, కృష్ణవేణి, శ్రీధర్, ప్రకాశ్, రవి, మనోహర్, ప్రభు చరణ్, గాయ త్రి, సౌమ్య, లోహిత, కల్యాణ్ ఆత్మ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్

- 91 శాతం విద్యార్థులు హాజరు
- జిల్లాలోని 7 కేంద్రాల్లో జరిగిన పరీక్ష

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సంగారెడ్డి కలెక్టరేట్, మే 24 : రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో మూడేండ్ల ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుతో పాటు వ్యవసాయ, వెటర్నరీ డిప్లొమా ప్రవేశాల కోసం శుక్రవారం జిల్లాలో నిర్వహించిన పాలిసెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం 2420 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 2200 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 220 మంది విద్యార్థులు పాలిసెట్‌కు డుమ్మా కొట్టారు. దీంతో 91 హాజరు శాతం నమోదైంది. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో 6 పరీక్షా కేంద్రాలు, జోగిపేట్‌లో ఒక కేంద్రంతో జిల్లాలో మొత్తం 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరిగింది. విద్యార్థులు పరీక్ష సమయానికి సంబంధిత పరీక్షా కేంద్రాలకు చేరుకోవడంతో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాలిసెట్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాసులు ఆయా పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

మట్టి తవ్వకాలపై అధికారుల ఆగ్రహం

పరిశ్రమలోకి తరలించిన మట్టిని పరిశీలిస్తున్న అధికారులు

జిన్నారం, మే 24 : గడ్డపోతారం పంచాయతీ అల్లీనగర్ గ్రామ పరిధిలోని బామన కుంటలో అక్రమ మట్టి తవ్వకాలపై రెవెన్యూ అధికారులు సీరియస్ అయ్యారు. కారకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అల్లీనగర్ బామన కుంట శిఖంలో నుంచి పగలు, రాత్రి అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి సర్వేనంబర్ 27లో కొత్తగా నిర్మిస్తున్న పరిశ్రమలోకి తరలించారు. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ భిక్షపతి ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ శుక్రవారం బామన కుంటను పరిశీలించారు. కుంట శిఖంలో షిటాచీలతో తవ్వి టిప్పర్ల ద్వారా పరిశ్రమలోకి తరలించిన ప్రాంతాన్ని పరిశీలించారు. దాదాపు ఐదు వందల టిప్పర్ల మట్టిని పరిశ్రమకు తరలించినట్లు గుర్తించారు. మట్టి తవ్వకాలపై పరిశ్రమ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టడంపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కాగా ఐదు వందల టిప్పర్ల వరకు తవ్విన మట్టిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని అధికారులను స్థానికులు అడిగారు. దర్జాగా బామన కుంటలో మట్టిని తవ్విన పరిశ్రమపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

పారిశుధ్య సమస్యకు పరిష్కారం

చర్యలు చేపడుతున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, మే 24 : ఆర్సీపురం డివిజన్‌లోని జ్యోతినగర్‌లో కొన్ని రోజులుగా పారిశుధ్య సమస్యతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో కాలనీవాసులు బల్దియా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించలేదు. 'కంపుకొడుతున్న కాలనీ' అనే శీర్షికను 'నమస్తేతెలంగాణ' ప్రచురించింది. దీనికి స్పందించిన కార్పొరేటర్ పుష్పానగేశ్ కాలనీవాసులతో మాట్లాడి ప్రత్యేకంగా జేసీబీని ఏర్పాటు చేయించి పారిశుధ్య సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. రూ.70లక్షలతో నూతన బాక్స్ డ్రైన్‌తో కూడిన నాలా ఏర్పాటుకు నిధులు మంజూరు జరిగిందని, కాంట్రాక్టర్ కూడా వచ్చారని తెలిపారు. జీహెచ్ఎంసీ మొత్తంలో కాంట్రాక్టర్లు సమ్మెలో ఉండడంతో పనులు కొద్దిగా ఆలస్యమవుతున్నాయని కార్పొరేటర్ కాలనీవాసులకు తెలిపారు. సమ్మె ముగిసిన వెంటనే బాక్స్ డ్రైన్ పనులు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో పాండురంగాచారి, ప్రమోద్‌గౌడ్, సాంబశివరావు, ఖలీమ్, శేఖర్, నిషాద్, పద్మ, మాలతి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వరంగ సంస్థ)

జహీరాబాద్ శాఖ

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)కు నిబంధనతో పదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

దిగువ రుణగ్రహీతలు మరియు హామీదారుల నుండి సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జహీరాబాద్ శాఖ**కు బకాయి 31-03-2021 నాటికి **రూ. 13,08,781/- (పదమూడు లక్షల ఎనిమిది